



పలాస రైల్వేస్టేషన్



ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్

ఇచ్ఛాపురానికి షాక్

- విశాఖ రైల్వేజోన్‌లో దక్కని చోటు
- ఈ ప్రాంతీయుల్లో ఆవేదన

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):

ఇచ్ఛాపురం ప్రాంతానికి రైల్వేశాఖ మరోసారి షాక్ ఇచ్చింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు కానున్న కొత్త రైల్వేజోన్‌ను పలాస వరకే పరిమితం చేసింది. ఇందులో ఇచ్ఛాపురానికి చోటు కల్పించలేదు. దీంతో పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ 49 కిలోమీటర్ల మేర స్టేషన్లు భువనేశ్వర్ కేంద్రంగా నడిచే ఈస్టుకోస్టు రైల్వేజోన్‌లోనే కొనసాగనున్నాయి. కొత్త జోన్‌లో ఇచ్ఛాపురానికి చోటుదక్కక పోవడంపై ఈ ప్రాంతీయుల్లో ఆవేదన వ్యక్తమమవుతోంది. విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త జోన్‌కు.. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌గా నామకరణం చేశారు. ఇప్పటివరకూ కొనసాగుతున్న వాల్తేరు రైల్వేడివిజన్‌ను విశాఖ డివిజన్‌గా మార్చారు. దాని పరిధిని 410 కిలోమీటర్లుగా విస్తరించారు. అయితే ఇప్పటివరకూ మన జిల్లాలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్లు ఈస్టుకోస్టు రైల్వే డివిజన్‌లో ఉండేవి. కానీ ఇప్పుడు విశాఖ నుంచి పలాస వరకూ అన్ని రైల్వేస్టేషన్లు విశాఖ డివిజన్‌లో చేర్చారు. అలాగే కొత్తగా విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లో విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, విశాఖ రైల్వేడివిజన్లు చేరనున్నాయి. ఈ లెక్కన శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం నుంచి పలాస వరకూ స్టేషన్లు ఈస్టుకోస్టు రైల్వే డివిజన్‌లో ఉండిపోనున్నాయి. దీనిపై ఈ ప్రాంతీయులు పెదవివిరుస్తున్నారు. విశాఖలో కొత్తగా ఏర్పాటైన డివిజన్‌తో పాటు జోన్‌లో చేర్చితేనే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. ఇక నుంచి ప్రత్యేక రైళ్లతో పాటు వసతులు పలాస వరకే పరిమితమయ్యే అవకాశం ఉంది. అటు ఈస్టుకోస్టు రైల్వేజన్ భువనేశ్వర్ కేంద్రంగా ఉండడంతో.. ఒడిశాలోని బరంపూర్ రైల్వేస్టేషన్ వరకే ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉంది. దీంతో ఇచ్ఛాపురం, సోంపేట, మందస వంటి స్టేషన్లు రెండు జోన్ల మధ్య వివక్షకు గురయ్యే అవకాశముంది. అందుకే అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు ఈ విషయంలో చొరవచూపాలని ఇచ్ఛాపురం ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. విశాఖ డివిజన్‌తో పాటు దక్షిణ కోస్తా జోన్‌లో పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ స్టేషన్లను చేర్చాలని కోరుతున్నారు. నౌపడ నుంచి పర్లా కిమిడి మార్గాన్ని విశాఖ డివిజన్‌తో పాటు జోన్‌లో చేర్చారు. కానీ పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ మాత్రం అలానే ఉంచేశారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అంత ఆదాయాన్ని.. వదులుకుంటుందా?

- జోన్ల పరిధిపై స్పష్టత ఇవ్వని ఈకో రైల్వేశాఖ
- ఆంధ్రా పరిధిలోని స్టేషన్లలో అయోమయం
- మళ్లీ మొదటికే వచ్చిన పలాస డివిజన్ పరిస్థితి

పలాస, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

పలాస, సోంపేట, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే (భువనేశ్వర్)కు బంగారు బాతు గుడ్లుగా అధికారులు గుర్తిస్తారు. ఎందుకంటే కేవలం ఈ మూడు స్టేషన్లలో ప్రయాణికుల ద్వారా ఏటా ఈకో రైల్వేకు రూ.30 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. అందుకే ఆంధ్రా పరిధిలో ఉన్న ఈ స్టేషన్లను ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ వదులుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న కొత్త రైల్వేజోన్, డివిజన్ కేంద్రంలో పలాస వరకూ విశాఖపట్నంలో కలుపుతున్నట్లు ప్రకటించారు. దీనిపై ఈ ప్రాంతీయులు పెద్దగా ఆశ్చర్యం చెందడం లేదు. ఎందుకంటే ఇప్పటికే వాల్తేర్ డివిజన్ పరిధి పలాస వరకూ ఉంది. పలాసకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజపురం రైల్వేగేటు (374) వరకూ నౌపడా ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తూ అక్కడ సిబ్బందే విధులు నిర్వహిస్తుంటారు. అక్కడ నుంచి పలాస కేంద్రంగా ఖుర్దా రోడ్ డివిజన్ ప్రారంభమవు తుంది. ప్రస్తుతం పలాస రైల్వేస్టేషన్.. పది రైల్వే లైన్లతో డివిజన్‌లో అతిపెద్ద స్టేషన్‌గా అభివృద్ధి చెందుతోంది. దీనికితోడు అమృత్‌భారత్ రైల్వేస్టేష న్‌గా తీర్చిదిద్దడానికి రైల్వేమంత్రిత్వ శాఖ రూ. 24.80కోట్లు నిధులు విడుదల చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పలాస వరకూ విశాఖ పట్నంలోను, నౌపడ నుంచి పర్లాకిమిడి వరకూ కూడా విశాఖ పరిధిలో ఉంటుందని ప్రకటించారు.

- వాస్తవానికి ఇచ్ఛాపురం, సోంపేట, మందస రోడ్, పలాస వరకూ విశాఖ డివిజన్‌లో కలపాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రరైల్వేశాఖ మంత్రికి విన్నవించారు. పార్లమెంటులో కూడా ప్రస్తావించారు. అయితే రూ.కోట్లలో ఆదాయం తీసుకువస్తున్న పలాస డివిజన్ పరిధిలో ఉన్న రైల్వేస్టేషన్లను ఈస్ట్‌కోస్ట్ రైల్వే విడిచిపెట్టడానికి మొదటి నుంచి ఒప్పుకోవడం లేదు. బెంగాల్- నాగపూర్ (బీఎన్ఆర్) రైల్వే, సౌత్ ఈస్టర్న్ రైల్వేలో మొదటగా పలాస వరకూ రైల్వేస్టేషన్లు ఉండేవి. కొత్తగా జోన్లు ఆవిర్భవించిన తరువాత ఈస్ట్‌కోస్ట్‌రైల్వేలో కూడా పలాస అంతర్భాగమైంది. దీన్ని విడదీయాలంటే సాంకేతికంగా రైల్వేశాఖ సిద్ధపడాలి. పలాసలో ప్యానెల్‌బోర్డ్‌తో డివిజన్‌కు అనుసంధానమైంది. తక్షణమే దీన్ని మార్పిడి చేయాలంటే రైల్వేశాఖకు తలకుమించిన భారమే. తొలుత బరంపురం (ఒడిశా)లో దీన్ని (మిగతా 6వ పేజీలో..)

న్యాయం చేయాలి



ఇచ్ఛాపురం, సోంపేట, పలాస వరకూ ఉన్న మొత్తం రైల్వే స్టేషన్లన్నీ విశాఖ డివిజన్ పరిధిలో చేర్పించాలి. ఎన్నోఏళ్లగా తెలుగు ప్రజల ఆకాంక్ష ఇది. ఉద్యోగుల బదిలీ నిర్వహించి మొత్తం ప్రక్రియ ఈ బడ్జెట్‌లోనే నిర్వహించాలి. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకోవాలి.

-నరేంద్ర, తెలుగు యువత, కాశీబుగ్గ

ఇది దారుణం



పలాస వరకూ విశాఖ రైల్వేడివిజన్, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్‌లో కలిపి.. ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని విస్మరించడం దారుణం. అటు నౌపడ నుంచి పర్లాకిమిడి వరకూ చేర్చారు. కానీ పలాస నుంచి 49 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇచ్ఛాపురాన్ని మాత్రం మరిచిపోయారు. ఇంతకంటే అన్యాయం ఉంటుందా? తక్షణం ప్రజాప్రతినిధులు స్పందించి ఇచ్ఛాపురం వరకూ స్టేషన్లను విశాఖ రైల్వే డివిజన్‌లో కలపాలి.

- కట్టా సూర్యప్రకాష్, డీఆర్‌యూసీసీ సభ్యుడు, ఇచ్ఛాపురం

బాధాకరం



ఇప్పటికే ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ అన్నివిధాలా వివక్షకు గురైంది. ప్రధాన రైళ్ల ఆగడం లేదు. ఇప్పుడు రైల్వే డివిజన్‌లో సైతం చోటు కల్పించకపోవడం దారుణం. రెండేళ్ల కిందట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకూ పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించాలి. విశాఖ రెల్వే డివిజన్‌లో చేర్చాలి. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ నుంచి అత్యధిక ఆదాయం వస్తున్నా ఈ స్టేషన్‌పై వివక్ష చూపటం అత్యంత బాధాకరం.

- ఎస్.విశ్వనాథం, హైకోర్టు న్యాయవాది, ఇచ్ఛాపురం

అచ్చెన్నకు 17వ ర్యాంకు

- మంత్రుల పనితీరు వెల్లడించిన సీఎం చంద్రబాబు
- కచ్చితంగా స్పీడ్ పెంచాల్సిందే



శ్రీకాకుళం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పనితీరులో టెక్కలి ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి 17వ ర్యాంకు లభించింది. గురువారం అమరావతిలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో.. మంత్రుల పనితీరును ర్యాంకుల వారీగా సీఎం చంద్రబాబు విడుదల చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది జూలై నుంచి డిసెంబర్ వరకు మంత్రుల పనితీరును పరిశీలించారు. ప్రజలు అందించిన వినతుల పరిష్కారం లోనూ.. పలు విభాగాలకు చెందిన ఫైల్స్ క్లియరెన్స్. ఇతర అంశాలను పరిగణన లోకి తీసుకుని ర్యాంకులను కేటాయించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార, మత్స్య, పశు సంవర్థకశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు 17వ ర్యాంకు లభించింది. మరో ఎనిమిది మంది మంత్రులు అచ్చెన్న తర్వాత స్థానంలో ఉన్నారు. ఏదిఏమైనా.. మంత్రి అచ్చెన్న మరింత స్పీడు పెంచాల్సి ఉందని ర్యాంకులు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో కీలకమైన శాఖలో వ్యవసాయ, మత్స్య, పశుసంవర్థకశాఖ ఒకటి. ఇందులో పనితీరు ఇంకాస్త మెరుగుపరిచి... పెండింగ్ ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు క్లియర్‌చేస్తే అచ్చెన్న మంచి స్థానంలో ఉంటారని ప్రజలు ఆశిస్తున్నారు.



జగతిమెట్ట కాలనీలో ఆక్రమణ ఇలా..

ఎవరైతే మాకేంటి?

- జగతిమెట్ట ఇళ్ల కాలనీలో

ఖాళీ స్థలాలు ఆక్రమణ

టెక్కలి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జగతిమెట్ట సమీపాన ఇళ్ల కాలనీ లేఅవుట్ ఆక్రమాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. ఆక్రమణదారులు బరితెగించి 'ఎవరైతే మాకేంటీ.. ఈ సైటు మాదే' అంటూ ఖాళీ స్థలాలు కబ్జాకు పాల్పడుతున్నారు. ఓ వైపు రెవెన్యూ అధికారులు కాలనీ స్థలాల ఆక్రమణపై విచారణ చేస్తుండగా.. మరోవైపు బుధవారం రాత్రికిరాత్రే కొంతమంది వ్యక్తులు ఖాళీ స్థలాలను చదును చేసి.. స్తంభాలు పాతి ఆక్రమణకు పాల్పడడం (మిగతా 6వ పేజీలో..)

డీపీఎన్ రోడ్డు విస్తరణకు ఆమోదం

- రూ.126.20 కోట్లు కేటాయింపు
- ఫలించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కృషి



కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డోల- పోలాకి- నౌపడ (డీపీఎన్) రోడ్డు విస్తరణకు కేంద్ర రోడ్డు రవాణాశాఖ ఆమోదం తెలిపింది. నరసన్నపేట, టెక్కలి, పలాస నియోజక వర్గాలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారి విస్తరించాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వివిధ సందర్భాల్లో కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించారు. ఎట్టకేలకు ఆయన కృషి ఫలించింది. రహదారి విస్తరణ పనులకుగానూ మొత్తంగా రూ.126.20 కోట్లు కేంద్రం కేటాయించింది. త్వరలో ఉద్దానం - సముద్ర తీరప్రాంతం -జాతీయ రహదారి మధ్య బలమైన అనుసంధానం ఏర్పడనుంది. పూర్తి వివరాలు 6లో



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలి

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై యువత ఉద్యమించాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలో వక్తలు

7లో

పొగమంచుతో అదుపుతప్పి..!





తరుణ్, కార్తీక్ (ఫైల్)

- డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. ఇద్దరు దుర్మరణం
- అర్ధరాత్రి దాటాక ఇంటికి వస్తుండగా ప్రమాదం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ స్నేహితులు. రాత్రివేళ సరదాగా బయటకు వెళ్లి తిరిగొస్తున్న వారిని.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. ఓ వైపు అతివేగం.. మరోవైపు పొగమంచు కారణంతో వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొద్ది సేపట్లో ఇంటికి వచ్చేస్తామని చెప్పి.. తీరని లోకాలకు చేరడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం జాతీయ రహదారికి సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వి.సందీప్ (మిగతా 6వ పేజీలో..)

జాతర్ల సందడి

- నేటి నుంచి కమ్మసిగడాం యాత్ర
- రేపు శాలిహుండం వేణుగోపాలుని ఉత్సవం
- చెట్లతాండ్రలో అరటి గెలల పండుగ కూడా..

6లో



దోనిపేట తీరంలో తాబేళ్ల కళేబరాలు

మృత్యు వలయంలో.. తాబేళ్లు

- జిల్లాలో గత నెలలో 363 మృతి
- ఇక సముద్రంలోకి కొట్టుకుపోయినవి ఎన్నో..
- ఓ సంస్థ అధ్యయనంలో సంచలన నిజాలు
- నిబంధనలకు విరుద్ధంగా చేపల వేట కారణం

రణస్థలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని తీరప్రాంతంలో పెద్ద ఎత్తున తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వేట సాగిస్తుండడం.. సముద్రంలో నీరు కలుషితమవుతుండడం.. తాబేళ్ల పాలిట శాపమవుతోంది. ఒక్క జనవరి నెలలోనే జిల్లాలో 363 తాబేళ్లు చనిపోయినట్టు ఒక అధ్యయనంలో తేలింది. చెన్నైకి చెందిన ట్రీ ఫౌండేషన్ అనే సంస్థ.. తాబేళ్ల పరిరక్షణ కోసం ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోంది. ఇటీవల మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది సహకారంతో జనవరిలో తీరంలో తాబేళ్ల మృతిపై సర్వే చేసింది. మన రాష్ట్రంలో 3,085 తాబేళ్లు చనిపోగా.. అందులో జిల్లాకు సంబంధించి 363 ఉన్నట్టు గుర్తించింది. వాస్తవానికి ఈ కాలంలో తీరంలో తాబేళ్లు మృతిచెందడం సర్వసాధారణం. కానీ ఈ ఏడాది మాత్రం అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

ఉత్పత్తికి అనువైన ప్రాంతం..

జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ తీరం విస్తరించి ఉంది. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో తీర ప్రాంతం ఉంది. విశాలమైన ప్రదేశం, ఎత్తైన ఇసుక తిన్నెలు ఉంటాయి. ఒడిశా తర్వాత తాబేళ్ల సంతతికి మన తీరం అనువైన ప్రాంతం. సాధారణంగా సముద్ర జలాల అడుగున తాబేళ్లు ఉంటాయి. ప్రతి 40 నిమిషాలకు ఒకసారి శ్వాస తీసుకునేందుకు ఉపరితలంపైకి వస్తాయి. అలాగే ఏటా నవంబరు నుంచి మార్చి వరకూ అర్ధరాత్రి 2 నుంచి ఉదయం 6 గంటల మధ్య తీరం వైపు వస్తుంటాయి. తీరానికి సుమారు 50 మీటర్ల దూరంలో ఉన్న ఇసుక దిబ్బల్లో బొరియలు చేసి గుడ్లు పెడుతుంటాయి. అటువంటి సమయంలోనే బోట్లు, వలలకు తాకి .. ఇతర కారణాలతో మృత్యువాత పడుతున్నాయి. స్థానిక మత్స్యకారులు ఏటా వందలాది తాబేళ్ల కళేబరాలను కప్పిపెడుతుండడం విచారకరం.

కానరాని నిబంధనలు..

నిబంధనలకు విరుద్ధంగా చేపలవేట తాబేళ్ల పాలిట శాపమవుతోంది. తీరానికి సమీపం నుంచే చేపలు వేటాడే మెకనైజ్డ్ బోట్లు, నిషేధిత వలలు వీటి పాలిట యమపాశాలుగా మిగులుతున్నాయి. పెద్ద ఇంజన్ బోట్లతో తీరానికి 8 కిలోమీటర్ల తరువాతే వేట సాగించాలన్న నిబంధన ఉంది. కానీ చాలామంది ఈ నిబంధనను పాటించడం లేదని ఆరోపణలున్నాయి. దీంతో ఉపరితలానికి వస్తున్న తాబేళ్లకు ఇంజన్ తగిలి మృత్యువాత చెందుతున్నాయి. అలాగే నదులు, ఏరుల నుంచి సముద్రంలో కలుస్తున్న నీరు కూడా కలుషితమై పెద్ద ఎత్తున తాబేళ్లు మరణిస్తున్నాయి. ప్రధానంగా వలల ప్రభావంతోనే అధికంగా తాబేళ్లు మృత్యువాత పడుతున్నట్టు తెలుస్తోంది. కోనాగిల్ నెట్, అటక, టేకు వలలను మత్స్యకారులు ఉపయోగిస్తుండడంతో వాటిని తట్టుకోలేని తాబేళ్లు మృతి చెందుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. తాబేళ్లకు హాని కలుగకుండా మత్స్యకారులు వలలు వాడుకోవాల్సిన అవసరం ఉంది.

- తాబేళ్లతో మత్స్యసంపదకు చాలా మేలు జరుగుతుంది. సముద్రంలో ఆక్సిజన్ పెంచడంతో పాటు మత్స్య సంపదను వృద్ధి చేయడంలో తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. చేపగుడ్లు తినే జెల్లీ ఫిష్ జాతిని నియంత్రిస్తాయి. చేపల ఉత్పత్తి పెంచేందుకు దోహదపడతాయి. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సముద్రంపై ఆధారపడిన లక్షలాది మంది జీవనోపాధికి మేలు చేస్తాయి. ఈ నేపథ్యంలో తాబేళ్ల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేస్తోంది. చెన్నైకి చెందిన ట్రీ సంస్థ హెచ్చరికలతో అప్రమత్తమవుతోంది. అన్ని జిల్లాల అధికారులకు తాబేళ్ల సంరక్షణపై ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. తాబేళ్లు సైతం వన్యప్రాణుల కిందకు వస్తాయి. భారత వన్యప్రాణి సంరక్షణ చట్టం -1972 ప్రకారం (మిగతా 6వ పేజీలో..)

శ్వేతగిరి యాత్రకు వేళాయే!



సిద్ధమైన లడ్డూ ప్రసాదం

- రేపు శాలిహుండం వేణుగోపాలుని ఉత్సవం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

గార, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన శాలిహుండం యాత్రకు వేళయ్యింది. ఈ కొండపై వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి, వీర వసంతేశ్వర స్వామి ఆలయాల సముదాయం వద్ద ఈ నెల 8వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా యాత్ర నిర్వహించనున్నారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున ఇక్కడ జరిగే యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వస్తారు. ఇందుకోసం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శాలిహుండం కొండపై (శ్వేతగిరి) రాజుల కాలం నాటి కాళీయ మర్దన వేణుగోపాల స్వామి ఆలయంతో పాటు వీర వసంతేశ్వర స్వామి వారి ఆలయం ఉంది. వీటితో పాటు అయ్యప్పస్వామి, లక్ష్మీనరసింహ స్వామి, దత్తాత్రేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. కొండ శిఖరాన వేంకటేశ్వర స్వామి, కొండ కింద వరదరాజు స్వామి, వేంకటేశ్వర స్వామి,



వేణుగోపాల స్వామి

లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలు ఉన్నాయి. భీష్మ ఏకాదశి రోజున భక్తులు సమీపంలోని వంశధార నదిలో స్నానాలు చేసి.. కాలి నడకన కొండపైకి చేరుకుంటారు. అక్కడ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ఆ రోజు ఉదయం స్వామి వారు పల్లకిలో వంశధార నది వద్దకు వెళ్లి.. చక్రస్నానాలు చేస్తారు. అదే సమయంలో వేలాది మంది భక్తులు కూడా నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. యాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.



క్యూలైన్ల వద్ద ఏర్పాటు చేసిన బెంచీలు

ప్రత్యేక బస్సులు..

శాలిహుండం యాత్రకు వచ్చే భక్తుల కోసం శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కొండపైన భక్తుల సౌకర్యార్థం బోరవానిపేట, బూరవెల్లి తదితర గ్రామాలకు చెందిన భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు అందించనున్నారు. పూసర్లపాడు గ్రామం వద్ద స్థానికులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కొండపైన స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఘాట్ రోడ్డుతో పాటు రెండు వైపులా మెట్ల మార్గాలు ఉన్నాయి.

ఏర్పాట్లు పూర్తి..

చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్వేతగిరి యాత్రకు అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నాం.

-మహేంద్రాడ రవికుమార్, వ్యవస్థాపక ధర్మకర్త, వీరవసంత ఈశ్వర స్వామి ఆలయం

మృత్యు 'వల'యంలో.. తాబేళ్లు

(ఐదో పేజీ తరువాయి)

తాబేళ్లను చంపడం నేరం. వాటి గుడ్లను సైతం తినడం, నాశనం చేయడం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. అందుకే ఈ చట్టాన్ని అనుసరించి తీరంలో తాబేళ్ల సంరక్షణపై ప్రత్యేక ఆదేశాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.

● తాబేళ్ల రక్షణకు చర్యలు..

జిల్లాలోని తీర ప్రాంతాల్లో తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అవి మృత్యువాత పడకుండా పటిష్ఠ చర్యలు చేపడతాం. చేపల వేట సమయంలో నిబంధనలకు పాటించేలా మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 16 తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. 5నెలల పాటు 40 మంది మత్స్యకారుల పర్యవేక్షణలో తాబేళ్ల సంతతి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. తాబేళ్లను చంపినా.. వాటికి నష్టం చేకూర్చినా చర్యలు తప్పవు.

-ఎస్.వెంకటేష్, జిల్లా అటవీ అధికారి, శ్రీకాకుళం



తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న దృశ్యం (ఫైల్)

రేపటి నుంచి అరటి గెలల పండుగ

- ముస్తాబవుతున్న చెట్లతాండ్ర
- మూడు రోజుల పాటు నిర్వహణ



చెట్లతాండ్రలోని లక్ష్మీనరసింహ స్వామి



ఆలయం వద్ద కట్టిన అరటి గెలలు (ఫైల్)

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి ఉత్సవాలకు మండలంలోని చెట్లతాండ్ర గ్రామం ముస్తాబవుతోంది. పురావస్తు అయ్యవారు ప్రతిష్ఠించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొనేందుకు ఏటా వేలాది మంది భక్తులు చెట్లతాండ్రకు వస్తుంటారు. దీనిని అరటి గెలల పండుగగా స్థానికులు పిలుస్తుంటారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా ఆలయం వద్ద భక్తులు అరటి గెలలు కట్టడం ఆనవాయితీ. కోర్కెలు తీర్చాలని కొందరు... కోర్కెలు తీరాయని కొందరు భక్తులు లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద అరటి గెలలు కడుతుంటారు. గత ఏడాది భీష్మ ఏకాదశి ఉత్సవాలలో 8 వేలకు పైగా అరటి గెలలను భక్తులు స్వామి వారికి సమర్పించారు. ఈ ఏడాది పదివేలకు పైగా అరటి గెలలు సమర్పించే అవకాశం ఉందని ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. దశాబ్దాల కిందట బయటి ప్రాంతం నుంచి వచ్చిన పురావస్తు అయ్యవారు ఇక్కడ స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని చెబుతారు. నాటి నుంచి ఏటా 3 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు.

సాంస్కృతిక ప్రదర్శనలు..

ఆలయాన్ని, గ్రామాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో మూడు రోజుల పాటు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంతబొమ్మాళి పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ పంగ అశిరినాయుడు తెలిపారు.

డీపీఎన్ రోడ్డుకు మంచి రోజులు

- కేంద్ర నిధులు మంజూరు



డీపీఎన్ రహదారి

శ్రీకాకుళం/సంతబొమ్మాళి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డోల-పోలాకి-నౌపడ (డీపీఎన్) రహదారికి మహర్దశ పడుతోంది. ఈ రహదారి విస్తరణకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శికి ఉత్తర్వులు అందాయి. ఈ రహదారిలో 0-17 కిలోమీటర్ల వరకు రూ.25.20 కోట్లు, 17 నుంచి 37.2 కి.మీ. వరకు రూ. 30.50 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 37.2 కిలో మీటర్లకు గాను రూ.55.70 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంతబొమ్మాళి నుంచి నౌపడ వరకు మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో 2016లోనే రోడ్డు విస్తరణ చేపట్టారు. మిగిలిన రహదారిని విస్తరించకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుల చొరవతో తాజాగా రూ.55.7 కోట్లు మంజూరయ్యాయి. దీనిపై ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే మండలంలోని 50 గ్రామాలకు పైగా రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. నౌపడ-వెంకటాపురం రహదారి విస్తరణకు రూ.47.50 కోట్లు మంజూరు కావడంతో నౌపడ, సీతానగరం, మర్రిపాడు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.

ఉత్తర్వులు వచ్చాయి..

డీపీఎన్ రోడ్డుకు రూ.37.2 కిలోమీటర్లకు నిధులు మంజూరు చేస్తూ జాతీయ రహదారుల శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. రహదారి విస్తరణతో రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.

-జగదీష్, ఏఈ, ఆర్అండ్‌బీ, టెక్కలి

ఫలించిన కేంద్ర మంత్రి కృషి..

జిల్లాలోని డోల-పోలాకి-నౌపడ రోడ్డు విస్తరణకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చేసిన కృషి ఫలించింది. దీనితో పాటు కంచిలి మండలం అంపురం- ఘాటిముకుంద పురం రోడ్డుకు రూ.23 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు జిల్లా ప్రజలకు ఇచ్చిన మరో ప్రధానమైన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. మూలపేట పోర్టు సమీపంలోనే ఎయిర్ పోర్టు రానున్న నేపథ్యంలో డీఎన్‌పీ రోడ్డు ఎంతో కీలకంగా మారనుందని తెలిపారు. ఉద్దానం వాసులు, మత్స్యకారులకు రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో పాటు వారి ఉత్పత్తులకు సరైన మార్కెట్ లభిస్తుందని అన్నారు. తద్వారా వారి ఆదాయ మార్గాలను మెరుగుపరచ వచ్చని వివరించారు. ఎన్డీఏ ప్రభుత్వం... డబుల్ ఇంజన్ సర్కార్ పని తీరుకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. దీనికి సహకరించిన కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

బెండి గేటు-నౌపడ రోడ్డుకు రూ.47.50 కోట్లు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పూండి... పరిసర గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నుంచి రూ.47.50 కోట్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి.



ఆలయంలోని దేవతల విగ్రహాలు

నేటి నుంచి కమ్మసిగడాం జాతర

రణస్థలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కమ్మ సిగడాం మహాలక్ష్మి అమ్మవారి జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. శుక్రవారం రాత్రి 9:25 గంటలకు మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు ఈ జాతర జరగనుంది. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా డ్రోన్, సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిఘా వేస్తున్నారు. బందోబస్తుకు 300 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్టు సీఐ ఎం.అవతారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా మూడు రోజులూ సినీ, టీవీ నటులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



జాతరలో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు

ఎవరైతే మాకేంటి?

(ఐదో పేజీ తరువాయి)

చర్చనీయాంశమవుతోంది. గతంలో రెవెన్యూ అధికారులు జగతిమెట్ట కాలనీ లేఅవుట్‌లో 335 ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు కేటాయించారు. కాగా 55 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన 280 పట్టాలకు సంబంధించిన లేఅవుట్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు ఇటీవల రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఆయా ఖాళీ స్థలాలు, నిర్మాణాల్లో.. 'ఇది ప్రభుత్వ జాగా, ఆక్రమిస్తే శిక్షార్హులు' అంటూ బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. గతంలో అక్రమాలకు సహకరించిన అధికారులను సైతం విచారణ చేస్తున్నారు. అయినా ఆక్రమణలు కొనసాగుతుండడం గమనార్హం. కాగా.. అధికారుల విచారణ నేపథ్యంలో ఇప్పటికే ఈ ఇళ్ల కాలనీ లేఅవుట్లలో తప్పిదాలకు పాల్పడిన కొందరు వైసీపీ నాయకుల గుండెల్లో అలజడి రేగుతోంది. ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా దీనిపై టెక్కలి ఉప తహసీల్దార్ ఎస్.రవికుమార్‌కు దర్యాప్తు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

పొగమంచుతో అదుపు తప్పి!

(ఐదో పేజీ తరువాయి)

కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నగరం ఫాజుల్‌బేగ్‌పేటకు చెందిన దీర్ఘాసి కార్తీక్ (21) తన ద్విచక్రవాహనంపై చౌదరి సత్య నారాయణ కాలనీలో ఉంటున్న స్నేహితుడు పండా తరుణ్ (19) ఇంటికి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో వెళ్లాడు. అక్కడి నుంచి వారిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లారు. అరిణాం అక్కివలస జంక్షన్ సమీపంలోని ఓ దాబాలో రాత్రి భోజనం చేసి.. తిరిగి శ్రీకాకుళం వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి ఒంటి గంట సమయంలో చిలకపాలెం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. అతివేగంతో రావడం, మరోవైపు పొగమంచు కారణంతో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు గుర్తించారు. చేతికి అందివచ్చిన కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

చివరిసారిగా తండ్రితో మాట్లాడి..

బుధవారం రాత్రి 12 గంటల సమయంలో చిట్టిబాబు తన కుమారుడైన తరుణ్‌కు ఫోన్ చేయగా, కొద్దిసేపట్లో ఇంటికి వస్తున్నామని చెప్పి తిరిగి లోకానికి చేరాడు. చిట్టిబాబు పండ్ల వ్యాపారం సాగిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా, తరుణ్ బట్టల షాపులో పనిచేస్తున్నాడు. తరుణ్ తల్లి గృహిణి కాగా, ఇతనికి ఓ చెల్లి కూడా ఉంది. అలాగే కార్తీక్ తండ్రి రాజు కొన్నేళ్ల కిందట మృతిచెందగా, తల్లి మణి ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. కార్తీక్ ట్రైరు బండితో ఇసుక వ్యాపారం చేస్తుండగా, ఇతనికో తమ్ముడు ఉన్నాడు. తరుణ్ తండ్రి చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు.

అంత ఆదాయాన్ని.. వదులుకుంటుందా?

(ఐదో పేజీ తరువాయి)

మార్పిడి చేయడానికి ప్రయత్నించినా, రైల్వేశాఖ ఒత్తిళ్ల కారణంగా మార్చలేక పోయారు. ప్రస్తుతం పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న రైల్వేస్టేషన్ల పరిధిలో మొత్తం 721 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జోన్లు వేరుచేయాలంటే వారికి ముందుగా కోరుకున్న ప్రదేశాలకు బదిలీ చేయాలి. ఎప్పటి నుంచో డివిజన్ కేంద్రాల్లో పనిచేస్తున్న తెలుగు వారందర్నీ ఆప్షన్లు కోరి బదిలీ చేయాలి. ముందుగా దీనిపై నిర్ణయం తీసుకొని తరువాత జోన్ల విభజన చేయాల్సి ఉంది.

● ప్రస్తుతం రైల్వేశాఖ పలాస వరకూ విశాఖలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారే తప్ప.. స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ ఇదే నిర్ణయానికి కట్టుబడి జోన్లు విడదీస్తే పలాస డివిజన్ పరిధిలో ఉన్న మందస రోడ్, సోంపేట, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లకు అన్యాయం చేసినట్లే. మళ్లీ పాత విధానం ద్వారే ఒడిశాలో వీటిని ఉంచేందుకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న రైల్వేస్టేషన్లను మొత్తం విశాఖ డివిజన్‌లో విలీనం చేస్తే తెలుగువారికి న్యాయం చేసినట్లవుతుంది. మొత్తం పాలన అంతా విశాఖపట్నం జోన్ పరిధిలో ఉద్యోగులు పనిచేయాల్సి ఉంటుంది. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు గట్టిగా పట్టుబట్టి మొత్తం ఇచ్ఛాపురం వరకూ ఉన్న తెలుగు రైల్వేస్టేషన్లన్నీ విశాఖజోన్ పరిధిలోకి తీసుకురావడానికి తీవ్రంగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

● ఇదిలా ఉండగా రైల్వేజోన్ల ప్రకటనపై ఉద్యోగ సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. పలాస వరకూ విశాఖలో ఉండేలా చర్యలు తీసుకున్నా, మొదటగా పలాస శివారున రాజపురం వరకూ వాల్తేర్ పరిధిలో ఉండేదని, అక్కడ వరకే జోన్ ఉంటుందని అధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నామని రైల్వేకార్మికసంఘ నాయకులు పేర్కొంటున్నారు. దీనిపై పూర్తి స్పష్టత వచ్చాకే తాము స్పందించగలమని చెబుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- 75 పరీక్ష కేంద్రాలు.. 40,356 మంది విద్యార్థులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై గురువారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐవో పి.దుర్గారావు మాట్లాడుతూ.. 10వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయన్నారు. ప్రయోగ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఒకేషనల్ కోర్సు పరీక్షలు 5 నుంచి ప్రారంభమైనట్టు తెలిపారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. మొత్తం 40,356 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని, ఇందులో ప్రథమ సంవత్సరం 20,389 మంది, ద్వితీయ సంవత్సరం 19,967 మంది ఉన్నారన్నారు. వీరిలో 37,976 మంది సాధారణ, 2380 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం 75 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జెరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని వసతులతోపాటు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో బస్సులు చేరుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీఈవో తిరుమల చైతన్య, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 45,657 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.35,58,63,479 విడుదల య్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. '2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని వివిధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు తొలివిడతగా ఈ నిధులు విడుదలయ్యాయి. ఎస్సీ విద్యార్థులకు మినహాయించి.. మిగిలిన వారందరికీ ట్యూషన్ ఫీజులను ఆయా కళాశాలల బ్యాంకు ఖాతాలకు జమ చేశామ'ని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలు చేరుకుంటాం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం సాయంత్రం సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ. జిల్లాలో పీ-4 అమలుకు తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు, డీఐపీఆర్వో కె.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జి.సిగడాం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు శ్రీకాకుళం ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లోని 33/11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులు, ఆధునికీకరణ పనులు కారణంగా జి.సిగడాం, బాతువ, గెడ్డకంచరాం, ఎస్‌పీఆర్ పురం, దేవరవలస, నిద్దాం, నడిమివలస, అద్వానంపేట, శేతుభీమవరం, జాడ, ఎందువపేట, గొబ్బూరు, చెట్టుపొదిలాం, మదుపాం, వెలగాడ, చంద్రయ్యపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

- సోంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సోంపేట 33/11 సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పలాస ఈఈ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సోంపేట టౌన్, బిరుసువాడ, కుసుమపురం, సోంపేట సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సోంపేట, జింకుభద్ర, బెంకిలి, పలాసాపురం, లక్కవరం, ఇసుకలపాలెం, రుషికుద్దా, రామయ్యపట్నం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం మున్సిపాల్టీతో పాటు మండలంలో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుగ్గు హరీష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
- కంచిలి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ లైన్ మెంటినెన్స్ పనులు సందర్భంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ యగేశ్వరరావు తెలిపారు.

ఎక్సైజ్ కేసులు రాజీ చేయించండి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి మౌలానా

గుజరాతీపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా ఎక్సైజ్ కేసులు రాజీ అయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో గురువారం ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ ఎక్సైజ్ కేసులు రాజీ చేసి, జిల్లాలో గల పెండింగ్ తగ్గించాలని సూచించారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎల్.అనురాధ దేవి, ఎంవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే 'రథసప్తమి' విజయవంతం

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నిరంతర పర్యవేక్షణ, సమష్టి కృషితోనే రథసప్తమి వేడుకలు విజయవంతం అయ్యాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్య ప్రదాత, అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు మూడు రోజుల పాటు కన్నులపండువగా సాగాయని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అవసరమైన సేవలు అందించారన్నారు. పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాలు, డ్రోన్ సాయంతో నిరంతర పర్యవేక్షణ చేపట్టామన్నారు. అన్ని శాఖల అధికారుల తమవంతు సహకారాన్ని అందించడంపై వారికి ధన్యవాదాలు తెలిపారు.

హెచ్ఎం తీరుపై ఆగ్రహం

పొందూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల కొత్త భవనం తాళాలను పగలుగొట్టి ఆ నెపం నాపై ఎందుకు నెట్టారని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకట్రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో నాడు-నేడు నిధులతో నిర్మించిన భవనాలకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పి.హేమలత(రాధ) అధికారులకు అప్పగించలేదు. అయితే హెచ్ఎం వెంకటరావు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తరగతి గదుల తాళాలు విరగొట్టించారు. ఈ విషయం తెలిసి హెచ్ఎంను హేమలత ప్రశ్నించగా.. తహసీల్దార్ ఆదేశాలతోనే తాళాలు విరగొట్టినట్టు చెప్పారు. దీంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి ఆమె తీసుకెళ్లడంతో తహసీల్దార్‌ను ప్రశ్నించారు. తనకేమీ తెలియదని తహసీల్దార్ చెప్పారు. దీంతో గురువారం హెచ్ఎంను పిలిపించి కాంట్రాక్టర్ సమక్షంలోనే నిలదీయడంతో హెచ్ఎం మిన్నకుండిపోయారు.

నేటి నుంచి వెంకన్న స్వామి కల్యాణోత్సవం

కవిటి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): లోళ్లపుట్టుగ గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ గ్రామస్థులు తెలిపారు. స్వామివారి సుప్రభాత సేవతో కార్యక్రమాన్ని ప్రారంభించి, 9వ తేదీన సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణం చేపట్టనున్నామన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక గాత్ర సంగీత కచేరి, హరికథ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

గుజరాతీపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన అవసరమని వైద్యులు దానేటి శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా స్త్రీలకు గర్భాశయం క్యాన్సర్ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, రిసోర్స్ పర్సన్స్ ఆర్.అరవింద్, కె.ప్రశాంతి, జి.ప్రమీల, అధ్యాపకులు పాల్గొన్నారు

ఇద్దరు ఉపాధి క్షేత్ర సహాయకుల సస్పెన్షన్

సోంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల్లో నమోదైన అభియోగాలపై 14రోజుల్లో వివరణ ఇవ్వాలని ఇద్దరు క్షేత్ర సహాయకులను సస్పెండ్ డ్వామా పీడీ బి.సుధాకరరావు ఉత్తర్వులు జారీ చేశారు. సోంపేట మండలం బారువా పంచాయితీ క్షేత్ర సహాయకురాలు పి.ధనలక్ష్మి 13, 14, 15, 16, 17 విడతల సామాజిక తనిఖీల్లో రూ.1,03,846 దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ అయిందని, అలాగే ఇదే మండలం కొర్లాం పంచాయతీ క్షేత్రసహాయకుడు తామాడ మోహన్‌కుమార్ 14, 15, 16, 17వ విడత సామాజిక తనిఖీల్లో రూ.1,18,544 నిధులు దుర్వినియోగం జరిగినట్టు నిర్ధారణ అయిందన్నారు. దీంతో వారు 14 రోజుల్లో వివరణ ఇస్తూ కార్యాలయంలో హాజరు కావాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మహిళపై దాడి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నగరాన్ని ఆనుకుని ఉన్న సీపాన్నాయుడుపేటలో నివాసముంటున్న బి.జయలక్ష్మి అనే మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి గాయపర్చారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న జయలక్ష్మిను భిక్షం వేయాలంటూ ఇద్దరు మగవాళ్లతో పాటు ఒక మహిళ అభ్యర్థించారు. భిక్షం వేసేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన జయలక్ష్మిపై దాడి చేశారు. టూటౌన్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పవర్ ప్రాజెక్టును అడ్డుకుంటాం

ఆమదాలవలస, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద 3,200 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన థర్మల్ పవర్ ప్రాజెక్టును అడ్డుకుంటామని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం పట్టణంలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సోంపేట, కాకరాపల్లిలో థర్మల్ పవర్ ప్రాజెక్టులు పెట్టాలని చూసి గత ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురై విరమించుకున్నాయన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. సమావేశం లో వైసీపీ నాయకులు సత్యనారాయణ, తమ్మినేని చిరంజీవినాగ్, పేడాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నాటిక పోటీలు

ఆమదాలవలస, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఈనెల 7 నుంచి ప్రారంభించనున్నట్టు రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. గురువారం పాలపోలమ్మ ఆలయ ఆవరణలో జరిగే ఈ నాటికి పోటీల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ మూడు రోజులు చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు

దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. గురువారం అమీన్‌సాహెబ్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పీఎం పోషణలో భాగంగా అందిస్తున్న రాగిజావను తీసుకోవాలన్నారు.


నృత్యం చేస్తున్న గిరిజనులు


ర్యాలీలో పాల్గొన్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని యువతే కాపాడాలి

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఉద్యమించాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలో వక్తలు

గుజరాతీపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుదారులు, కార్పొరేట్ శక్తుల నుంచి ఈ దేశాన్ని యువతే రక్షించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గురువారం ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల్లో భాగంగా గురువారం ఆర్ట్స్ కళాశాల రోడ్డు సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. తొలుత రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన యువత నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఏడు రోడ్ల జంక్షన్ నుంచి సభా ప్రాంగణం వరకు సాగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో యువత ఈ దేశంలో పెద్దఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 78 ఏళ్ల స్వాతంత్ర భారత దేశంలో పేదరికం పోయిందా అంటూ ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ మాట్లాడుతూ.. దేశాన్ని కేంద్రంలోని బీజేపీ విభజించి పాలిస్తుందని, మతం, కులం, భాష పేరుతో దేశ ప్రజల ఐక్యతను దెబ్బ తీస్తుందన్నారు. ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ సర్కార్లు కాదని, బుల్డోజర్ సర్కార్లని రాష్ట్ర, దేశ ఆర్థిక అభివృద్ధిని రోజురోజుకు దిగజారుస్తుందన్నారు. 40 ఏళ్లుగా నాగావళి, వంశధార సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేయకుండా ఒడిశాతో ఉన్న నీటి సమస్యను పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో ఆదివాసులకు రక్షణ లేకుండా పోయిందని మండి పడ్డారు. ఈ సందర్భంగా వందేమాతరం శ్రీనివాస్ పలు విప్లవ గీతాలు ఆలపించారు. ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి నక్కి. లెనిన్ బాబు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఆహ్వాన కమిటి నాయకులు చాపర సుందరలాల్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-ఏ కోలనీలో గల తన కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి గురువారం వినతులు స్వీకరించారు. ఈ వినతదులపై తక్షణం స్పందిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీస వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం: డీఎంహెచ్‌వో

అరసవల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నులిపురుగులను నివారించేందుకు పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ అన్నారు. గురువారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న డీవార్మింగ్ డే నిర్వహిస్తున్నామని, ఆ రోజున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మాత్రలు వేయిస్తామన్నారు. ఈ మాత్రలను నమిలి తినిపించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆ రోజు మాత్రలు వేసుకోని వారిని గుర్తించి 17వ తేదీన వేయిస్తామన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు మొత్తం 3,317 ఉండగా, అందులో చదువుకునే విద్యార్థులు 3,50,931 మంది, 3,358 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1-5 సంవత్సరాల పిల్లలు 95,577 మంది ఉన్నట్టు గుర్తించామన్నారు. బడికి వెళ్లకుండా ఉన్నవారు 484 మంది, మొత్తంగా 4,46,992 మంది పిల్లలకు అందించేందుకు మాత్రలు సిద్ధం చేశామని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, సీఆర్‌పీల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. వైద్య సిబ్బందితోపాటు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవాసంస్థల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాలి: ఎస్పీ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై జరిగే పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి చార్జ్‌షీట్లను నిర్ణీత గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని, ఆయా వివరాలు పోలీస్ సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. గురువా రం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్ఐ నుంచి డీఎస్పీ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. పోక్సో కేసులను 69 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, సైబర్ సెల్ సీఐ శ్రీను, ఇతర పోలీసు అధికారులు, వారి వారి స్టేషన్ కార్యాలయాలు నుంచి పాల్గొన్నారు. అలాగే నూతనంగా శ్రీకాకుళం జిల్లా వైబ్‌సైట్‌ను రూపకల్పన చేసిన కంచిలి మండలం కేసరపడ గ్రామానికి చెందిన కొరికాన నవీన్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

సమాజ చైతన్యానికి స్ఫూర్తిగా నిలవాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ పీటీ తులసీ

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మహిళలు రాణించి సమాజాన్ని చైతన్యపర్చాల్సి ఉందని పద్మావతి మహిళా యూనివర్సిటీ (తిరుపతి) సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ పీటీ తులసి అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మహిళా సాధికారిత జీవనోపాధి అనే అంశంపై గురువారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ.. విద్యా చైతన్యం, ఆర్థిక పరిపుష్టి, రాజకీయ ప్రాధాన్యం, సామాజిక భాగస్వామ్యం, కుటుంబ సంక్షేమం, ఆరోగ్యదాయక జీవనం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడంతోనే మహిళలు విజయవంతంగా మరింత ముందుకు పయనించగలరని చెప్పారు. భారత్ అభియాన్ ప్రాంతీయ సంచాలకులు బి.పావని, వర్సిటీ సోషల్‌వర్క్ విభాగాధిపతి డాక్టర్ యు.కావ్య జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, అధ్యాపకులు డాక్టర్ యు.శాంతి, డాక్టర్ కె.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పొందూరు పట్టణంలో జరుగుతు న్న రోడ్డు పనులను ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ గురువారం పరిశీలించారు. కాటిచెరువు కాలనీ నుంచి పెదచెరువు వరకు సుమారు రూ.90 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. పనులు వేగవంత చేయాలని మార్చిలోపు పూర్తి చేయాలని చెప్పారు. పార్టీ నాయకులు సీహెచ్ రామ్మోహన్, ఎ.రాము, బి.శంకరభాస్కర్, బాడాన గిరి తదితరులు ఉన్నారు. కాగా పీయూసీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కూన రవికుమార్ నియమితులవడంతో తాడివలస సర్పంచ్ తమ్మినేని మనెమ్మ ఆధ్వర్యంలో గ్రామస్థులు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ దంపతులు

రణస్థలం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి పంచాయతీ పరిధిలోని గోశాల, రాధకృష్ణ మందిరంలో గురువారం సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా వేదమంత్రాలతో పూజలు చేశారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, రజిని దంపతులు పాల్గొని పూజలు చేశారు. శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం జరగనున్నదని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనలని శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన అధ్యక్షుడు కేశవ గోస్వామి మహరాజ్ కోరారు.

సైన్సుపై అవగాహన పెంచుకోవాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సాంకేతిక వైజ్ఞానిక రంగాల్లో రాణించాలంటే టెన్త్ విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సహలాలపుట్టుగ జడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్ పాడీ అన్నారు. గురువారం కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం నరేంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు సైన్స్‌పై అవగహన నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రాపై ఒడిశా జట్టు విజయం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సురంగిరాజా మైదానంలో జరిగిన అంతరాష్ట్ర మహిళా క్రికెట్ టోర్నీలో ఆంధ్రాపై ఒడిశా జట్టు విజయం సాధించింది. గురువారం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ సౌజన్యంతో ఆంధ్రా-ఒడిశా జట్లు మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్రా జట్టు నిర్ణీత 40 ఓవర్లలో 183 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం 184 పరులు విజయ లక్ష్యంతో బాటింగ్ ప్రారంభించిన ఒడిశా జట్టు 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఒడిశా జట్టుకు చెందిన జూలీబెహరా నిలిచింది. కార్యక్రమంలో ఐసీసీ క్లబ్ గౌరవ అధ్యక్షుడు దాసరి రాజు, జిల్లా క్రికెట్ సంఘం చీఫ్ కోచ్ సుదర్శన్, జిల్లా సెలెక్టర్ కె.కిరణ్, జిల్లా క్రికెట్ సంఘ మేనేజర్ జీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆపరేషన్ 'కగార్' నిలుపుదల చేయండి

పలాసరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టులను అణిచివేసేందుకు నిర్వహిస్తున్న కగార్ ఆపరేషన్‌ని నిలుపుదల చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కగార్ పేరుతో కేంద్రప్రభుత్వం అటవీ భూమిని భూగర్భ అటవీ ఖనిజ వృక్ష సంపదతో పాటు కార్పొరేట్లకు అప్పగించేం దుకు సిద్ధమైందని, అటవీ చట్టాలను పార్లమెంటులో మార్పిడి చేసి వారికి అనుకూలంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల నుంచి ఆదివాసీలను తరిమికొట్టి ఆ సంపదనంతా కార్పొరేటర్లకు ఇచ్చేందుకు ప్రణాళికలు వేస్తున్నారని, ఆదివాసీల రక్షణకు మావోయిస్టులు బలవుతున్నారన్నారు. ఇప్పటికైనా అటవీ ప్రాంతంలో జరిపే కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేసి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

వేతన సమస్య పరిష్కారానికి కృషి: ఆర్డీవో

హరిపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లులు, జీడి పరిశ్రమల కార్మికుల వేతన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీవో జి.వెంకటేష్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కార్మిక సంఘాలు, సీఐటీయూ నేతలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి వేతన ఒప్పందాలను తెలుసుకొని ఇరువర్గాల సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామన్నారు. జూన్‌లో వేతన ఒప్పందాలను పునరుద్ధరించాల్సి ఉన్నా అటు యాజమాన్యాలు, ఇటు ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆయా సంఘాల నేతలు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హైమావతి, డీటీ రామకృష్ణ, సీఐటీయూ నేతలు దిలీప్, ఎన్.గణపతి, లక్ష్మీనారాయణ, కార్మిక సంఘాల నేతలు కేశవరావు, వెంకటేశం, దుర్యోధన, పత్రి అప్పలస్వామి పాల్గొన్నారు.

మంచి ధర లభించేలా చర్యలు

పాతపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకున్న స్థలాలకు మంచి ధర లభించేలా చర్యలు తీసుకుంటామని భూసేకరణ విభాగం స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లావణ్య అన్నారు. ఉద్దానం సెకండ్ ఫేజ్ లైన్ ప్రక్రియకు అవసరమైన భూ సేకరణలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రహరాజపాలెం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దిగువ ప్రహరాజపాలెంలో వీధి మధ్య నుంచి ఈ పైపులైన్లు వేయాల్సి ఉన్నందున రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. అలాగే ధర తదితర అంశాలపై గ్రామస్థులు, రైతులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అంతకు ముందు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, మండల సర్వేయర్ రామగణపతి, ఆర్ఐ బాబీ పండిత్ పాల్గొన్నారు.

ముమ్మరంగా అపరాల పంట నూర్పిడి



పొలంలోనే యంత్రంతో మినప చేను నూర్పిడి చేస్తున్న రైతులు

జలుమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రబీలో పండించిన మినప, పెసర చేను నూర్పిడి పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. అయితే పాత పద్ధతులను విడనాడి యాంత్రీకరణ వైపు అడుగులు వేస్తున్నారు. గతంలో పండిన మినప, పెసర చేనిని కల్లాలకు తరలించి అక్కడ ఎండబెట్టి గొడ్డతో నూర్పిడి చేసేవారు. ప్రస్తుతం పొలాల్లోనే పెసర, మినప మొక్కలను ఎండబెట్టి నేరుగా యంత్రంతో నూర్పిడి చేస్తున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో పంటను భద్రపరచుకునేందుకు సమయం ఆదా అవుతుందని రైతులు భావిస్తున్నారు.

అథ్లెటిక్స్ పోటీలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో బుధవారం జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరి చినట్లు హెచ్ఎం బరాటం కామరాజు తెలిపారు. 200 మీటర్ల పరుగుపందెంలో జోత్స్న ప్రథమ, 400 మీటర్లలో శ్రావ్య ద్వితీయ, 200, 300 మీటర్ల పరుగు పందెంలో ధర్మతేజ మూడో స్థానంలో నిలిచారన్నారు. అలాగే 200 మీటర్ల పరుగు పందెంలో దివ్య ద్వితీయ, హైజంప్‌లో యువరాజ్ ప్రథమ, 400 మీటర్లలో దుర్గాప్రసాద్ నాల్గో స్థానం పొందారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన పీడీలు ప్రమీల, ప్రభావతిలను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభి నందించారు.

ఘనంగా సత్యసాయి పల్లకిసేవ

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి 100వ పుట్టిన రోజు సందర్భంగా గురువారం పలకీ సేవ నిర్వహించారు. సత్యసాయి మందిరం నుంచి పల్లకిపై సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి కొత్తపేట, జాతీయరహదారి, పాకివలస వరకు సాయినామ స్మరణ చేస్తూ ఊరే గింపు చేపట్టారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

నాణ్యతలోపం..!

- రూ.1.58 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు
- వైసీపీ హయాంలో కాంట్రాక్టర్‌కే లబ్ధి
- అప్పుడే పాడైన కొరసవాడ- రొమదల రోడ్డు



గోతులమయమమైన రొమదల బీటీ రోడ్డు

పాతపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొరసవాడ నుంచి రొమదల గ్రామం వరకు సుమారు రూ.1.58 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు అనతికాలంలోనే గోతుల మయం కావడంతో నాణ్యతపై సర్వత్రా విమర్శలు వినిపి స్తున్నాయి. వైసీపీ హయాంలో 2020 నవంబర్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి శంకుస్థాపన చేశారు. అనతికాలం లోనే పనులు పూర్తి చేశారు. అయితే రోడ్డు పనుల్లో నాణ్యత పాటించక పోవడంతో కొద్ది సంవత్సరాల్లోనే గోతులుగా తయారు కావడంతో పనుల సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోయిందని స్థానికుల నుంచి విమర్శలొస్తున్నాయి. కాంట్రాక్టర్ లబ్ధికే పనులు జరిగాయని, ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు మహేంద్ర తనయనదిపై జరిగిన వంతెన నిర్మాణం పూర్తయిన తరువాతే వినియోగం లోకి వచ్చిందని, ఈ రూట్‌లో ఆర్టీసీ సేవలు ప్రారంభం కాకుండానే రోడ్డు పాడవడంపై ప్రజల నుంచి అసంతృప్తివ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మో కుక్కలు

- శునకాల సంచారంతో ప్రజల్లో హడల్
- ఆసుపత్రులకు బాధితులు
- పట్టించుకోని పంచాయతీలు



నందిగాం బజారులో గుంపుగా తిరుగుతున్న కుక్కలు



కుక్కకాటుకు గురైన కమలమ్మ, లోహితాసుడు

నందిగాం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కల గుంపులతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వాహనాల వెంబడి పరిగెత్తడమే కాకుండా పాదచారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల కాలంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వచ్చే పరిస్థితి లేదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మనుషులపైనే కాకుండా పశువులపైనా దాడి చేసి గాయపరిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత నెలరోజులుగా మండలం లోని పలు గ్రామాల ప్రజలు కుక్క కాటునకు గురై నందిగాం, నౌగాం పీహెచ్‌సీల తో పాటు టెక్కలి, పలాస ప్రభుత్వాసుపత్రులు, పూండిలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించారు. చేతిలో కర్ర లేనిదే వీధిలోకి రాలేక పోతున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఎన్.రూపావతి(నర్సిపురం), జె.మహాలక్ష్మి (కొండపేట), ఎన్.అప్పారావు, కె.తులసమ్మ, పి.కమలమ్మ, వినోద్(నందిగాం), ఎంయాదయ్య (వేణుగోపాలపురం), ఎం.తారకేశ్వరరావు(హుకుంపేట), టి.లోహితాసుడు (మణిగాం), వనజనాభం (సుభద్రాపురం) ఇలా మరికొందరు ఆసుపత్రుల్లో కుక్కకాటుకు చికిత్స చేయించుకున్నారు. మూగజీవాలైన పశువులు, మేకలు, గొర్రెలపై కూడా కుక్కల గుంపులు దాడిచేయడంతో మృత్యువాతకు గురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య ఉన్నతాధికారుల దృష్టికి..



కుక్కల నివారణకు సంబంధించి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. కుక్కలను అనుమతులు లేకుండా చంపడం నేరం. గ్రామాల్లో ప్రజల వినతుల మేరకు అధికారుల అనుమతులు పొంది తగు చర్యలు తీసుకుంటాం

- టి.రాజారావు, ఎంపీడీవో, నందిగాం

డిపో నిర్వహణ ఇలాగేనా?

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆగ్రహం

పాతపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోని ఇలాగేనా నిర్వహించేదని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జీసీసీ పరిధిలోని రేషన్ దుకాణాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టాకుకు, రికార్డుల్లో వ్యత్యాసం ఉండడంపై నిర్వాహకురాలు సీహెచ్ పాపమ్మను ప్రశ్నించారు. ఎండీ యూ ఆపరేర్ బాలకృష్ణను పిలిపించి ఇళ్లవద్దకు సరుకులను సకాలంలో అందిస్తున్నారా అని ప్రశ్నించారు. స్టాకు, రిజిస్టర్లలో తేడాలపై షోకాజ్ నోటీసివ్వాలని అధికా రులను ఆదేశించారు. స్థానిక కేజీబీవీని సందర్శించి తనిఖీ చేశారు. స్టోర్‌రూం నిర్వాహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు ఇటువంటి వాడిపోయిన కూరగాయలు వండిపెడతారా అని ప్రశ్నించారు. తక్షణం కూరగాయల సరఫరాదారుకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశిం చారు. విద్యార్థి నులతో మాట్లాడి సహపంక్తి భోజ నం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.వైకుంఠరావు, పలువురు సిబ్బంది తదితరులు ఉన్నారు.



పాతపట్నం: విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేస్తూ మాట్లాడుతున్న జేసీ ఫర్మాద్ అహ్మద్‌ఖాన్

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు

హరిపురం, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని, అధైర్యపడొద్దని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. రాధాకృష్ణపురంలో రైస్‌మిల్లులను ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి మిల్లు తమ లక్ష్యాల మేరకు బ్యాంకు గ్యారెంటీ సిద్ధం చేసి రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు ఆర్డీవో జి.వెంకటేష్, తహసీల్దార్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ధనదాహానికి పరాకాష్ఠ నల్లబొడ్లూరు కొండ

హరిపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రూ.లక్షల విలువ చేసే నల్ల బొడ్లూరు కొండ వైసీపీ నాయకుల ధనదాహానికి పరాకాష్ఠగా నిలిచిందని టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరులో సర్వే నెంబరు 74లో సుమారు 10 ఎకరాల కొండను సర్పంచ్ ప్రతినిధి బొడ్డు ఉమాపతి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు తవ్వకాలు చేపట్టి డి-పట్టాలు పొందారని, దీనిపై అధికారులు విచారణ చేపడితే అనేక విష యాలు వెలుగులోకి వస్తాయన్నారు. గతంలో గౌతు శిరీష ఆధ్వర్యంలో వైసీపీ నేతల అక్రమాలను అడ్డుకుంటే బొడ్డు ఉమాపతితోపాటు వైసీపీ నాయకులు ధనబ లంతో ఎదురుదాడి చేశారని గుర్తు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొండనే మాయం చేశారని, పూర్తి స్థాయిలో పరిశీలించి ఇంకా వెనుకనున్న పెద్ద తలలను పట్టుకోవాలని కోరారు. కాశీబుగ్గలో జరిగిన ఇంటి తగాదాలను ఎమ్మెల్యే శిరీషకు ముడి పెట్టడం వైసీపీ సోషల్ మీడియాకే చెల్లిందన్నారు. మాజీ మంత్రి అప్పలరాజు ఘోరంగా ఓటమి చెందినప్పటినుంచి ఇలాంటి దుశ్చర్యలకు పాల్ప డుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, లచ్చయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోదండరాముని విగ్రహాలతో శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

టెక్కలి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నర్సింగపల్లిలో కోదండరామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం భక్తులు శోభాయాత్ర చేపట్టారు. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి, అర్చకులు శతపతి ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో రామ భక్తులు ఊరేగింపుతో మహిళలు జలయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. యాగ శాల పూజ, అఖండ దీపస్థాపన, నవగ్రహపూజలు, అగ్ని ప్రతిష్ఠ, హోమాది కార్యక్రమాలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. కార్యక్ర మంలో సర్పంచ్ గౌతు జయమోహన్, పోలాకి షణ్ముఖరావు, దారపు చందనం, పొట్నూరు గుణాకర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు నిధుల మంజూరు హర్షణీయం

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) పూండి పరిసర గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.47.50 కోట్లు నిధులు మంజూరు చేయడం హర్షణీయమని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ గొరకల వసంత స్వామి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ అన్నారు. గురువారం పూండిలో విలేకరులతో మాట్లాడుతూ.. 22.2 కిలోమీటర్ల మేరకు రెండు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారన్నారు. పూండి వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పనలో విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు ఇచ్చిన హామీల మేరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశార న్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోవింద పాపారావు, దున్న షణ్ముఖరావు, చింత నారాయణ పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణకు నిధుల మంజూరు ఉత్తర్వులను చూపుతున్న నాయకులు

4ఆర్ కాలువపై రోడ్డు తొలగింపు



కాలువపై నిర్మించిన రోడ్డును తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దారు హనుమంతరావు

హిరమండలం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భగీరథపురం సమీపంలో 4ఆర్ పిల్ల కాలువపై మట్టితో వేసిన రోడ్డును అధికా రులు తొలగించారు. ఐదు నెలలుగా రోడ్డు వేసి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు స్పందించలేదు. దీనిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'కాలువ కప్పేసి.. ఇసుక తరలింపు' శీర్షికతో వచ్చిన కథనంతో పాటు రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదు లతో తహసీల్దార్ హనుమంతరావు స్పందిం చారు. ఆయన దగ్గరుండి సదరు కాలువ పై నిర్మించిన రోడ్డు ను తొలగించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉమా శంకర్, వీఆర్వో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ధాన్యం బస్తాలు కూడా..

నందిగాం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నర్సిపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిల్వ చేసిన ధాన్యం బస్తాలను తొలగించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'పంచాయతీ కార్యాలయంలో ధాన్యం నిల్వ' శీర్షికతో వచ్చిన కథనానికి ఎంపీడీవో టి.రాజారావు స్పందించారు. తక్షణం వాటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణారావు సూచించారు. ఆయన సంబంధిత వ్యక్తులను పిలిచి ఆ ధాన్యం బస్తాలను అక్కడి నుంచి బయటకు తరలించారు.

ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని టెక్కలి ఉద్యానశాఖాధికారి కె.సునీత అన్నారు. గురువారం ఆయిల్‌ఫాం సాగును పరిశీలించారు. నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్ ఫాం పథకం ద్వారా జిల్లాలో ఆయిల్‌ఫాం సాగు కోసం ప్రభుత్వం రైతులకు రాయితీలు అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్‌ఫాం పంట ఏడాది పొడుగునా సాగునీటి వసతి ఉన్న చోట సాగు చేసేందుకు అనువైన పంట అని, ఏడాదికి 8 నుంచి 14 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. శతశాతం రాయితీతో మొక్క లు ఇస్తామని నాలుగేళ్ల సాగు కోసం రూ.8,400, అంతర పంటలకు రూ.8,400 ఒక ఎకరానికి రాయితీ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలని ఆమె సూచించారు.

గోరువాని చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలు



నిర్మాణానికి వేసిన మెటీరియల్

నరసన్నపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతకు అనుకొని ఉన్న గోరువాని చెరువు గట్టుపై ఓ వ్యాపారి చదును చేసి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. గత రెండు రోజులుగా పల్లిపేట రోడ్డువైపు మెట్ల సమీపంలో గోడౌన్ నిర్మాణానికి గట్టును చదును చేసి మెటీరియల్‌ను వేశారు. రాత్రి సమయంలో నిర్మాణం చేసేందుకు సిద్ధమవుతున్నాడు. గతంలో ఇదే ప్రాంతంలో ఒక నిర్మాణం జరగగా పక్కానే నిర్మాణం చేపట్టేందుకు వ్యాపారి కొందరి రాజకీయ నాయకులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం గోరువాని చెరువు గట్టు ఆక్రమణ, నిర్మాణంపై ఈవో ద్రాక్షాయిణి వద్ద ప్రస్తావించగా అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నామన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

నందిగాం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సుబ్బమ్మపేటలోని లక్ష్మీ నరసింహ స్వా మి కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త కె.రంగనాధన్ తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వివిధ కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామన్నారు. చందనం పూత పూసే ఆలయాల్లో ఈ ఆలయం రెండవదన్నారు. తొలి రోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, శనివారం సాయంత్రం కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ఆదివారం ధ్వజావరోహణ, చక్రస్నానాలు, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

టెక్కలి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలిలో పారిశుధ్య పనులను గురువారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పర్యవేక్షించారు. ప్రతిరోజు ఉదయం గంట పాటు పారిశుధ్య పనులను తనిఖీ చేస్తానన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీభాయి, ఈవో జగన్నాథరావులతో పట్టణంలో తీసుకోవాల్సిన పారిశుధ్య చర్యలపై ఆయన సమీక్షించారు.

మద్యం దుకాణం దరఖాస్తుకు గడువు పెంపు

పాతపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీశయన కులస్థులకు కేటాయించిన మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వతేదీ వరకు గడువు పెంచినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు రాకపోవడంతో గడువు పెంచినట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

అన్నదానానికి రూ.40 వేల విరాళం

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదానానికి కోటబొమ్మాళి కర్లావీధికి చెందిన అంగూరు వెంకటేశ్వరరావు పట్నాయక్, లత దంపతులు గురువారం రూ.40 వేల విరాళాన్ని ఈవో వాకచర్ల రాధాకృష్ణకు అందజేశారు. దాతలకు ఈవో అమ్మవారి చిత్రపటం అందించారు.

మద్యం దుకాణాల్లో నేతల జోక్యం ఉండకూడదు

నరసన్నపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలల్లో రాజకీయ నేతల ప్రమేయం ఉండరాదని జనసేన నియోజవర్గ ఇన్‌చార్జ్ బలగ ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కల్లుగీత కార్మికులు, ఉపకులాల అభివృద్ధికి కేటాయించిన 10శాతం మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు వివిధ రాజకీయ పక్షాలు సిండికేట్‌గా ఏర్పడి గీత కార్మికుల హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తున్నాయని వీటిపై పోరాటం చేస్తామన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

నరసన్నపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ రాయి కన్నా తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించారు. జిల్లాలో స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో మొదటి, సాఫ్ట్ బాల్ పోటీల్లో తృతీయ స్థానం పొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఈటీ మధుసూదనరావు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నరసన్నపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. గురువారం బొడ్డవలస సత్యసాయి మందిరంలో కంప్యూటర్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కంప్యూటర్, కుట్లు, అల్లిక వంటి రంగాల్లో పేద విద్యార్థులకు, మహిళలకు తర్ఫీదు ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా మార్గం చూపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌చార్జి నరసింహమూర్తి, సమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రరవు, సేవాదళ్ ఇన్‌చార్జి లలితమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలపై నోటీసులు

జలుమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు బకాయి పడిన ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ వేంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు రూ.50 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు నోటీసులు జారీచేశామన్నారు. రెండు వారాల్లోగా బకాయిలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అప్పటికీ చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామన్నారు. అలాగే పాఠశాలలు విద్యుత్ బకాయిలు రూ.11 లక్షల వరకు ఉన్నాయన్నారు. పాఠశాలలు విద్యుత్ బకాయిలు చెల్లించాలని సంబంధిత ఎంఈవోలకు నోటీసులు జారీచేశామన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

నందిగాం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల దినం సందర్భంగా సోమవారం విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఎంపీడీవో టి.రాజారావు సూచించారు. గురువారం నందిగాం పీహెచ్‌సీలో వైద్యాధికారి కె.అనిత కుమారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తరువాత ఈ మాత్రల ను వేయాలన్నారు. ఎంఈవో జి.నర్సింహులు, సీహెచ్‌వో దాతారాం పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నేరం

టెక్కలి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరి చట్టరీత్యా నేరమని టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. వెట్టిచాకిరి నిర్మూలర దినం సందర్భంగా గురువారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం వెట్టి చాకిరిని నిర్మూలించేందుకు కృషి చేస్తామని ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సహాయ కార్మిక అధికారి పి.సువర్ణ మాట్లాడుతూ.. 16 నుంచి 60 ఏళ్ల లోపు అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారికి రూ.2 లక్షల ఉచిత బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, కార్మికశాఖ అధికారులు రాధాకుమారి, మల్లేశ్వర రావు, న్యాయవాదులు గోవింద్, మధుబాబు, బాలకృష్ణ, ప్రభుచంద్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆరా

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఇళ్ల వద్ద చదువుతున్నారా లేదా అనే విషయమై ఉపాధ్యాయులు ఆరా తీస్తున్నారు. మార్చి 17 నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠ శాల ఉపాధ్యాయులు రాత్రి సమయాల్లో విద్యా ర్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నారు. దండు గోపాలపురం, కోటపాడు, కొత్తూరు, వడ్డి తాండ్ర, కాశీపురం, బృందావనం, చెట్ల తాండ్ర, రెయ్యపేట గ్రామాల్లో రాత్రి వేళల్లో వాకబు చేస్తున్నారు. పరీక్షలు పూర్తయి నంతవరకు విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండేలా చూడాలని తల్లిదండ్రు లకు సూచిస్తున్నారు. హెచ్ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.